క్లుప్తంగా

బాలా త్రిపుర సుందరి మాతకు విశేష అలంకరణ


ప్రత్యేక అలంకరణలో బాలా త్రిపుర సుందరి అమ్మవారు

భీమవరం(ప్రకాశం చౌక్): ధనుర్మాసం సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలా త్రిపుర సుందరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి సుమారు 500 ఆపిల్స్‌తో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో అకన రాంబాబు, నాగలక్ష్మి దంపతులచే అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, బాలా త్రిపుర సుందరి మహిళ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాయకుదురులో గ్రామ దేవతల జాతర మహోత్సవాలు


అమ్మవార్ల జాతర నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: మండలంలోని రాయకుదురులో శ్రీ మావుళ్లమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజు స్వామి వారల బల్ల సేవా జాతర మహోత్సవం గురువారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ముందుగా మేళ, తాళాలతో, బాణాసంచా కాల్పుల మధ్య అమ్మవార్లను ఆలయం దగ్గర నుంచి నడివీధికి తీసుకువచ్చి, పూరి గుడిసెలో ఉంచారు. అనంతరం గరగ నృత్యాలతో అమ్మవార్ల జాతర మహోత్సవం అత్యంత కన్నుల పండుగ చేపట్టారు. కాళిక నృత్యాలు, కేరళ డప్పు బృందాలు, సినీ సంగీత విభావరులు విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విశాఖపట్నంలో ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు


భీమవరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర మహాసభలు విశాఖపట్నంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు బీజేపీ నరసాపురం పార్లమెంట్ కన్వీనర్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పేరిచర్ల వెంకటశ్రీనివాస రాజు(సుభాష్) చెప్పారు. జనవరి 24వ తేది నుంచి మూడు రోజులు నిర్వహించే ఏబీవీపీ రాష్ట్ర మహాసభల పోస్టర్స్‌ను గురువారం ఆవిష్కరించిన సందర్భంగా వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ కాయిత డిన్ను చందు, జిల్లా కన్వీనర్ రాయి వెంకట్, పవన్, ఆనంద్, తేజ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడికి రూ. 10 వేల జరిమానా

తణుకు అర్బన్: బెల్ట్ షాపు నిర్వాహకుడికి ఇరగవరం తహసీల్దార్ ఎం.సుందరరాజు రూ.10వేలు జరిమానా విధించారు. తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇరగవరం మండలం కత్తవపాడు గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న మురాల చిన్ని ఇరగవరం మండలం కత్తవపాడు గ్రామంలో అనధికారికంగా మద్యం బాటిల్స్ విక్రయిస్తూ గతంలో పట్టుబడిన మురాల చిన్ని అనే వ్యక్తిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో హాజరపరచగా బెల్ట్ షాపులు నిర్వహణ తదితర నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో ఉంటానని అతని నుంచి గతంలో సత్ప్రవర్తన కోసం 1 సంవత్సర కాలానికి బాండ్ తీసుకున్నారు. అయితే అతను రాసిచ్చిన సత్ప్రవర్తన బాండును ఉల్లంఘిస్తూ ఈ నెల 2న అనధికారికంగా మద్యం విక్రయిస్తూ 6 మద్యం బాటిల్స్‌తో తిరిగి తణుకు ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. సదరు నిందితుడు చిన్ని సత్ప్రవర్తన బాండ్లను ఉల్లంఘించి అనధికారికంగా బెల్ట్ షాపులు నిర్వహించినందు వల్ల జరిమానా విధించినట్లు తెలిపారు. సదరు జరిమానాను నిందితుడు బుధవారం రూ.10వేలు చలానా రూపంలో చెల్లించారు. జరిగింది. అనధికారికంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, తణుకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో తరచుగా నేరాలకు పాల్పడే వారిపై సంబంధిత తహసిల్దారు కోర్టులో బైండోవర్ చేస్తున్నామని వివరించారు.

క్రీడలపై ఆసక్తి అవసరం

తాడేపల్లిగూడెం రూరల్: క్రీడల పట్ల యువత ఆసక్తి కనబర్చాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం నాయుడు అన్నారు. గురువారం మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రఘురాం నాయుడు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని చాటుకోవాలన్నారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పొనుకుమాటి శేషులత పాల్గొన్నారు.

వెలవెలబోయిన బరులు


ఖాళీగా ఉన్న సీసలి కోడి పందేల బరి


పెనుమంత్ర మండలంలో ఓ బరి వద్ద షామియానా తొలగిస్తున్న దృశ్యం


పెద అమిరం కోడి పందేల బరి ఇలా


పెనుమంత్ర మండలంలో ఓ బరిని ఖాళీ చేస్తున్న దృశ్యం

భీమవరం: సంక్రాంతి సందర్భంగా మూడు రోజులు పాటు విచ్చల విడిగా సాగిన కోడిపందేలు, జూదాలు నాల్గవ రోజు గురువారం కూడా జరుగుతాయని ప్రచారం చేసిన కూటమి నాయకులకు నిరాశ మిగిలింది. గురువారం కూడా పందేలు జరుగుతాయని నిర్వహకులు పందెంరాయుళ్లకు సమాచారం ఇవ్వడంతో ఉదయాన్నే బరులు వద్దకు కోడి పుంజులతో చేరుకోగా.. పందేల నిర్వహణకు అనుమతులు రావాలంటూ కొంచెం సమయం వేచి చూడాలంటూ నిర్వాహకులు చెప్పడంతో చేతుల్లో పుంజులను పట్టుకుని పందేల రాయుళ్లు అక్కడే పడిగాపులు కాశారు. జిల్లాలోని ఒక ప్రముఖ నాయకుడు రాష్ట్రస్థాయి నాయకులు, అధికారులతో మాట్లాడుతున్నారని తప్పక అనుమతులు వస్తాయంటూ చెప్పడంతో మధ్యాహ్నం వరకు బరులు వద్దనే వేసిచూసిన పందేలరాయుళ్లు చివరకు నిరాశతో వెనుదిరిగారు.

పందేలు నిర్వహిస్తే ఆయా పరిధిలో పోలీసులపై చర్యలు

సంక్రాంతి పండుగకు వారం రోజులు ముందుగా ఎట్టిపరిస్థితుల్లోను కోడి పందేలు, జూదాలు నిర్వహించరాదని కలెక్టర్, ఎస్పీ ప్రకటించినా మూడు రోజుల పాటు పందేలు, జూదాలు విచ్చలవిడిగా సాగినా పోలీసులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. అయితే కనుమ రోజు బుధవారం సాయంత్రం సమయంలో పోలీసులు కోడి పందేల బరులు వద్దకు వెళ్లి ఖాళీ చేయించారు. అయితే గురువారం కూడా పందేలు జరుగుతాయని ప్రచారం జరగడంతో జిల్లా ఉన్నతాధికారి ఏ పోలీసుస్టేషన్ పరిధిలో పందేలు ఆయా స్టేషన్స్ పోలీసులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో ఆయా స్టేషన్స్ సిబ్బంది పందేలు నిర్వహించిన ప్రాంతాల్లో కాపు కాచి పందేలు జరగకుండా అడ్డుకున్నారు. పందేల ప్రాంతం వద్ద పోలీసులు ఉండేసరికి పందెం రాయుళ్లు మెల్లగా జారుకున్నారు.

నిలిచిన కోడిపందేలు

కాళ్ల: సంక్రాంతి పురస్కరించుకుని నాలుగవ రోజు కూడా పందేలు కొనసాగుతాయని పందెంరాయుళ్లు ఆశించారు. వారు ఆశించిన రీతిలోనే బుధవారం పందెం నిర్వాహకులు గురువారం ఉదయం నుంచి పందేలు ఉంటాయని బహిరంగంగా చెప్పడంతో పందెంరాయుళ్లు ఆనందం వ్యక్తం చేశారు. దీంతో పందెం రాయుళ్లు గురువారం ఉదయం నుండి పందేలకు సిద్ధమయ్యారు. అయితే పోలీసుల ఆంక్షలతో పందేలు లేవని తెలియడంతో పందెంరాయుళ్లు నిరాశగా వెను తిరిగారు. అయితే అప్పటికే నిర్వాహకులు పందేలు ఉంటాయని అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఆఖరి నిమిషంలో పందేలు లేవని తెలియడంతో పందెం రాయళ్లతోపాటు నిర్వాహకులు సైతం నిరాశ వ్యక్తం చేశారు. కోడిపందేలు జరగకపోవడంతో బరులు వెలవెలబోయాయి.

కోడి పందేల స్థావరాలపై దాడులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో కోడిపందేలపై దాడి చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు. గురువారం వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వీరంపాలెం గ్రామ శివారు ఖాళీ స్థలంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు రూరల్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఇరువురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1600లు నగదు, రెండు కోడి పుంజులు, రెండు కోడికత్తులను స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ పోలీసులు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, చినతాడేపల్లి శివారు ఖాళీ స్థలంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఇరువురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1600లు నగదు, రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు.

జాతరను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి


భీమవరంలో గ్రామదేవతల జాతర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఐ నాగరాజు తదితరులు

భీమవరం: గ్రామశాంతి కోసం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఏర్పాటు చేసిన పండుగలు, జాతరలు సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం నాగరాజు అన్నారు. పట్టణంలోని గునుపూడి గ్రామ దేవతలు శ్రీఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవారి 34వ జాతర మహోత్సవం ఈ నెల 19వ తేదీ నుండి 26 వరకు ఆదిలక్ష్మి రజక యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతర ఉత్సవాల పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కళాకారులకు ప్రోత్సాహం అందిస్తూ, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు తెలియజేప్పే విధంగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ జాతరలో ఉభయ తెలుగురాష్ట్రాల్లో పేరు గాంచిన 400 మంది కళాకారులు పాల్గొంటున్నారని 19వ తేదీ గ్రామోత్సవంతో ప్రారంభమై 21వ తేదీ ప్రభోత్సవం, 23వ తేదీ సన్నాయి వాయిద్యాలు, ఆసాదుల గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, బుట్ట బొమ్మలు, కోయ డాన్స్‌లు, అఘోరాల ప్రదర్శనలు, శక్తి వేషాలతో సోమగుండం చెరువు చుట్టూ మహా జాతరగా ప్రదర్శిస్తారని, 26న అఖండ అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రామకృష్ణ, రజక యూత్ నాయకులు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, దొమ్మేటి సుబ్బయ్య, నేదునూరి గంగాధర్ తిలక్, గరగపర్తి మల్లేశ్వరరావు, పరశురాం, గరగపర్తి శ్రీహరి, కొల్లేటి అయ్యప్ప పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి విశేష పూజలు


దిరుసుమర్రులో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు స్వామివారి ప్రదసాదాన్ని అందజేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో శ్రీ గంగా భ్రమరాంభిక సమేత రామలింగేశ్వరస్వామిని గురువారం చిన్న పరిశ్రమల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు, పాలకమండలి సభ్యులు ఆలయ మర్యాదలతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాలకమండలి సభ్యులు స్వామివారి ప్రసాదాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ, ఆలయ కమిటీ ఛైర్మన్ అల్లూరి బంగార్రాజు, కలిదిండి పేర్రాజు, మైగాపుల గంగారామ్, నక్కా రామోజీ, పెన్మెత్స సత్యనారాయణరాజు, గవర శ్రీ రాజబాబు, ఏళ్ల బాబులు, కౌరు పృథ్వీశంకర్, రుద్రరాజు పుల్లంరాజు, గాదిరాజు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పోడూరు: నేటి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని మాజీ ఎంపీటీసీ గోగులమండ విజయాదేవి పిలుపునిచ్చారు. జిన్నూరు పెదపేటలో సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక సంఘం, యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు గురువారం రాత్రి స్థానిక నాయకుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. స్థానిక బాలబాలికలకు, యువతకు జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో క్రీడాపోటీలు నిర్వహించారు. బహుమతి ప్రదానోత్సవంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు విజయాదేవి మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రతిఏటా పెదపేటలో క్రీడాపోటీలు నిర్వహించడం ఎంతో ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ డైరెక్టర్ వడ్లపాటి శ్రీలక్ష్మి, వార్డుమెంబర్లు మేడిది నిర్మలకుమారి, కాటం రామదాసు, స్థానిక నాయకులు కాటం జయరాజు, గోగులమండ రత్నాజీ, పిల్లి పెంటయ్య, పీతల రామారావు, నల్లి దయానందం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు


చెడుగుడు పోటీల్లో విజేతలకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

ఆకివీడు: గ్రామీణ క్రీడలైన చెడుగుడు, కబడ్డీ పోటీలు డీవైఎఫ్ఐ లాంటి సంస్థలు నిర్వహించడం వల్లే ఇంకా వాటి మనుగడ ఉందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు అంబటి రమేష్ చెప్పారు. సంక్రాంతి యువజనోత్సవాల్లో డీవైఎఫ్ఐ నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు గురువారం ముగిశాయి. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రమేష్ మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. క్రీడలతోనే అంతర్జాతీయ స్థాయిలో దేశ కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయన్నారు. ఎంతో మంది క్రీడాకారుల్ని ప్రోత్సహించి, వారి ప్రతిభను వెలికితీస్తున్న డీవైఎఫ్ఐ కృషి అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో విజేతగా అయి భీమవరం జట్టు, రన్నర్‌గా ఏలూరుపాడు జట్టు నిలిచింది. కార్యక్రమంలో కుంకట్ల దానయ్య, గంధం ఉమ, అట్లూరి రంగారావు, డాక్టర్ పీటీ ప్రతాప్‌కుమార్, ఆహ్వాన సంఘ గౌరవధ్యక్షుడు ఎండీ.మదనీ, డీవైఎఫ్ఐ నాయకులు, ఆహ్వాన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

● ఇక వెళ్లొస్తాం


ఆకివీడులో రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

సంక్రాంతి పండుగ ముగిసిన నేపథ్యంలో ఇళ్లకు వచ్చిన బంధువులు తిరుగు పయనమయ్యారు. నాలుగో రోజైన గురువారం ముక్కనుమ రావడంతో నైవేద్యాలు పెట్టుకున్న అనంతరం సాయంత్రం నుంచి తమ ఇళ్లకు బయలుదేరారు. ఐదో రోజు శుక్రవారం రావడంతో ఆ రోజు వెళ్లకూడదనే ఉద్దేశంతో ఎక్కువ మంది గురువారం సాయంత్రమే పయనమయ్యారు. కొంత మంది సొంత వాహనాల్లో వెళ్తే మరికొంత మంది రైళ్లు, బస్సుల్లో వెళ్లారు. దీంతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి.

– ఆకివీడు

అగ్నిప్రమాద బాధితులకు సాయం


బాధితులకు సహాయం చేస్తున్న తహసీల్దార్


యలమంచిలి: అగ్ని ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి స్వచ్ఛంద సంస్థలు ఎప్పుడూ ముందుంటాయని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ అన్నారు. వడ్డిలంక గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కామన మారియ్య, నాగమణి, కామన నాగేశ్వరరావు, దుర్గాభవాని కుటుంబాలకు బళ్ల కృపావరం చారిటీస్ సభ్యులు గురువారం దుస్తులు, పప్పు దినుసులు, బియ్యం బస్తా తహసీల్దార్ చేతుల మీదుగా అందజేశారు. ముందుగా ప్రభుత్వం తరఫున తహసీల్దార్ బాధితులకు రూ.5 వేలు నగదు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కేఎస్పీ కుమార్, బళ్ల మూర్తిరాజు, తోట ప్రత్యూష, సన్‌షైన్, మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, పీతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ రోజుల్లో మురుగునీటి సరఫరా


జాతీయరహదారిపై నిలిచిన మురుగునీరు

ఆకివీడు: పండుగ రోజుల్లో మురుగునీరు కుళాయిల ద్వారా సరఫరా చేశారని జాతీయరహదారికి చేర్చి కైకలూరు వైపు ప్రాంతంలోని ప్రజలు వాపోతున్నారు. స్థానిక కెనరా బ్యాంక్ ప్రాంతం నుంచి ఎఫ్‌సీఐ వరకూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న నివాసదారులకు మురుగు నీరు సరఫరా అయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిల ద్వారా మురుగు నీరు వస్తుందని ఫిర్యాదు చేసినప్పటికీ నగర పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలోని దత్త క్షత్రం వద్ద ఉన్న ఒక కాఫీ హోటల్‌కు సంబంధించిన మురుగునీటి పారుదల కోసం ఆ ప్రాంతంలో తవ్వగా కుళాయి పైపు పగిలి మురుగనీరు ప్రవేశించిందని ఆ ప్రాంత ప్రజలు చెప్పారు. కుళాయిల్లో మురుగునీటితో పాటు ఆ నీరు తీవ్ర దుర్గంధం వచ్చిందని పేర్కొంటున్నారు. గురువారం నాటికి కూడా పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. ఇదే ప్రాంతంలో రోడ్డుకు మరో వైపు ఉన్న అపార్టుమెంట్ నుంచి మురుగునీరు నేరుగా జాతీయ రహదారిపైకి వచ్చి తీవ్ర దుర్గంధభరితంగా ఉంది. అపార్టుమెంట్‌నుండి వచ్చే మురుగునీటిపై నగర పంచాయతీ ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడంతో ఆ ప్రాంతంలోని వ్యాపారస్తులు, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు

వీరవాసరంలో రైళ్లకు హాల్ట్‌లు ప్రకటించాలి


వీరవాసరంలో చింతా మధు సుధన రావుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

వీరవాసరం: వీరవాసరం రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లకు హాల్ట్‌లను ప్రకటించాలని రైల్వే ప్రయాణికుల సంక్షేమ సంఘం గురువారం రైల్వే కమర్షియల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (సికింద్రాబాద్)చింతా మధుసుధనరావుకు వీరవాసరంలో వినతిపత్రం అందజేశారు. నరసాపురం నాగర్సోల్ ఎక్స్‌ప్రెస్‌కు, నర్సాపూర్ నుంచి వెళ్లి అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు వీరవాసరం రైల్వే స్టేషన్లో హాల్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. గంగ గోదావరి కారిడాన్ కలిపే విధంగా విశాఖపట్నం మీదుగా నరసాపురం నుంచి వారణాసి వరకు పూర్తిస్థాయిలో రైలును నడపాలని కోరారు. సబ్బారపు వెంకట్రావు, భాజంకి కృష్ణారావు, వీరవల్లి రామకృష్ణ ,కందులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ నిర్వాహకురాలు చెన్నా త్రికళ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు గురువారం జరిగిన అన్న సమారాధనలో ఆర్గనైజేషన్ సేవలను కొనియాడారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమానికి 200 కేజీలు బియ్యం, లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోంకు 150 కేజీలు బియ్యం, నిడదవోలు లెప్రసీ కాలనీకి 300 కేజీలు బియ్యం, మొత్తం 650 కేజీలు బియ్యం అందజేశారు.

పాస్టర్ల సదస్సుకు హాజరుకావాలి

ఉండి: ఆకివీడు మండలం ధర్మపురం అగ్రహారం బాప్టిస్టు చర్చిలో ఈ నెల 29న నిర్వహించే నియోజకవర్గ పాస్టర్ల సదస్సులో ఉండి మండలంలోని యుపీఏ(యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్) సభ్యులంతా హాజరుకావాలని ఉండి మండల యుపీఏ అధ్యక్షకార్యదర్శులు సోడాదాసి పీటర్,వై యోనాతాన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించే ఈ సదస్సులో బ్రదర్ ఎస్.జోసఫ్‌కరుణ షాలేము ప్రార్ధనా మందిరం విజయవాడ నుంచి విచ్చేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్వర్ణోత్సవాల స్ఫూర్తితో ముందుకు


కె.సుజాత

ఆకివీడు: స్వర్ణోత్సవాల స్ఫూర్తితో తమ కళాశాల భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవాలు విజయవంతమైన సందర్భంగా గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఎంతో దృఢమైన సంకల్పంతో స్వర్ణోత్సవాలను విజయవంతంగా నిర్వహించారని చెప్పారు. పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక కళాశాలకు కొత్త రూపం తీసుకువస్తుందన్నారు. సమష్టి కృషితో నిర్వహించిన స్వర్ణోత్సవాలు బంగారు భవితకు మార్గం చూపించాయన్నారు. కార్పొరేట్ వసతులు సమకూర్చుకున్న కళాశాలలో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగేందుకు అధ్యాపక సిబ్బంది కృషి చేస్తారనే నమ్మకం కలిగిందన్నారు. స్వర్ణోత్సవాలు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రిన్సిపాల్ ధన్యవాదాలు తెలిపారు.

నేడు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం: పట్టణంలోని రాయలం విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతులు, కొత్తబ్రేకర్ ఏర్పాటు, లైన్లపై చెట్లు కొమ్మలు తొలగించడం కోసం 17వ తేది ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. రాయలం, బలుసుమూడి, డీఎన్నార్ కాలేజ్ రోడ్, బీసీ కాలనీ, లెక్చరర్ వీధి, రామలక్ష్మీనగర్, గొల్లవాని తిప్పరోడ్డు, ప్రకాష్ నగర్, గొరగనమూడి, కొమరాడ, డేగాపురం, అనాకోడేరు, తుమ్మగొప్పు, ఈలంపూడి గ్రామాలతోపాటు రాయలం, అనాకోడేరు, కొమరాడ ఇండస్ట్రియల్ లైన్లు, ఆక్వా చెరువుల లైన్లకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

● ఏఎస్ఆర్ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో....

పట్టణంలోని ఏఎస్ఆర్ ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏబీ స్విచెస్ మరమ్మతులు కారణంగా వివిధ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రెండవ పట్టణ పరిధిలోని ఏఎస్ఆర్ నగర్ ఫీడర్, పద్మాలయ ఫీడర్, బలుసుమూడి ఫీడర్, చినఅమిరం ఫీడర్స్ పరిధిలో చెట్లు కొమ్మలు తొలగించడానికి, లైన్ మెయింటినెన్స్ కోసం ఏఎస్ఆర్‌నగర్, ఆదర్శ నగర్, పద్మాలయ రోడ్, బలుసుమూడి, చినఅమిరం ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.